# వానకురిసిన రాత్రి

[జ్యోతి మాసపత్రిక]

నాలోని పాపాన్ని, కుటిలత్వాన్నీ, స్వార్థాన్నీ ఎత్తిచూపి, ఎగతాళి చేసే సంఘటన ఆ వాన కురిసినరాత్రి సంభవించింది! అందుకే ఈనాటికీ వర్షం కురుస్తూవుంటే, ఆ హోరు ఎవరో ఏడుస్తున్నట్లు విన్పిస్తుంది! ఆ వర్షం కురిసిన రాత్రి ఏం జరిగింది? ...

కథా నిలయం
3517
శ్రీకాకుళం

# వాన కురిసిన రాత్రి

నేను ముత్యపు చిప్పను కాను.

నాకు ఆనందం కల్గించటానికి స్వాతి చినుకులే అక్కరలేదు.

వాన చినుకులు ఎప్పుడు నింగి నుండి రాలినా నా కిష్టమే!

నల్లని మబ్బులనుండి పూసల దండలా చినుకులు పడుతూవుంటే, చూడటానికి నాకు ఎంతో ఆహ్లాదంగా వుంటుంది.

మట్టిమీద చినుకులు పడిన తరువాత, గాలి మోసుకొచ్చే వింత పరిమళమంటే నాకు ఎంతో ఇష్టం!

చీకటి సుందరి పెదవిమీద చిరునవ్వులా వెలిగి మాయమయ్యే మెరుపులు చూడటంలో నాకు ఎంతో తృప్తి లభ్యమవుతుంది.

వాన కురుస్తున్నప్పుడు గదిలో కూర్చుని-

వెచ్చగా సిగరెట్లు పీలుస్తూ -

కథలు రాయడం నాకు దాదాపు ఒక హాబీ లాంటిది.

కానీ —

రెండు సంవత్సరాల క్రితం జరిగిన ఆ సంఘటన నన్ను పూర్తిగా మార్చివేసింది!

ఇపుడు వర్షం కురుస్తూవుంటే, ఆనాటి దృశ్యమే నా కనుల ముందు ప్రత్యక్షమౌతుంది.

నా పాపాన్ని, కుటిలత్వాన్ని, స్వార్థాన్నీ ఎత్తిచూపి ఎగతాళి చేస్తూ వుంటుంది ఈనాటికీ ఆ సంఘటన!

ఇప్పుడు వర్షం కురుస్తూవుంటే —

ఆ హోరు ఎవరో బాధగా మూలుగుతున్నట్లు,

రాక్షసి ప్రసవవేదనను అనుభవిస్తున్నట్లు, అన్పిస్తుంది.

కొన్ని కోట్ల గొంతులు వెక్కి వెక్కి ఏడుస్తూవుంటే-

ఆ కన్నీరే వర్షం కురుస్తున్నట్లు భాధపడతాను.

రెండు సంవత్సరాల క్రితం ఆ రాత్రి —

కాటుకలా నల్లని మబ్బులు నింగిని ఆక్రమించుకున్న రాత్రి —

చెట్లను నేల గూల్చేలా ప్రచండ వేగంతో గాలి వీచిన రాత్రి —

ఆ రాత్రి నాకు బాగా జ్ఞాపకం!

గది తలుపులు బిగించి, కుర్చీలో కూర్చుని, కాళ్ళు టేబిలు మీద పెట్టి, సిగరెట్లు అగ్గిపుల్లల్ని వేస్టు చేయకుండా కాలుస్తూ —

రాచకొండ విశ్వనాధ శాస్త్రిగారి 'మంచి చెడ్డల్లో ఏ కథ?'

చదవటం పూర్తిచేసి, ఆలోచనలో పడ్డాను.

ఆ కథలో రెండు భాగాలున్నాయి.

మొదటి భాగం పేరు 'మంచి'

రెండో భాగం పేరు 'చెడ్డ'

రెండూ మంచి కథలే! రెండూ గొప్ప కథలే!

ఆ రెండు కథలూ, ప్రతి మనిషిలోనూ ఆలోచన రేపే కథలే!

"ఆ రెండు కథల్లో మీకు ఏది ఎక్కువ ఇష్టమో చెప్తే, మీ స్వభావం కొంతవరకూ వెల్లడవుతుంది" అంటూ చివరన ఓ పరీక్ష పెట్టారు రచయిత!

ఎంత సేపు ఆలోచించినా ఆ రెండు కథలలో నేను దేనిని ఎక్కువ ఇష్టపడ్డానో నిర్ణయించుకోలేకపోయాను.

కానీ, ఇపుడు అనిపిస్తోంది — వాటిలో నాకు రెండో భాగమే ఎక్కువ నచ్చిందని!

ఆ ఆత్మ పరీక్ష సమయంలో —

తలుపు దబదబ బాదిన చప్పుడయింది.

లేచి వెళ్ళి తలుపు తీశాను.

వర్షపు జల్లు ఒక్కసారి నా మొహాన కొట్టింది.

ఆయాసంతో తడిసి ముద్దయిన ఆకారం —

అది జగన్నాధానిది!

గబగబా గదిలోకి వచ్చేడు జగన్నాధం!

వాడు నాతోటి గుమస్తా.

మీరు ఒక్కసారి వాడిని చూస్తే "వీడు చిరు గుమాస్తా వెధవ!" అని పోల్చేస్తారు.

ఈ దేశంలో గుమాస్తాలు పడే బాధలన్నీ వాడి ముఖంలో గూడు కట్టుకుని వుంటాయి.

జగన్నాధం చూడటానికి చాలా బాధగా కన్పిస్తాడు.

వాడి ముఖంలో మంచితనం కొట్టొచ్చినట్లు కనబడకపోయినా, జగన్నాధం అతిమంచివాడు!

వాడి మంచితనం, నిజాయితీ ఈ రెండూ కలిసి వాడిని అతి దారిద్ర్యావస్థకు తీసుకు వెళ్ళేయి.

"ఇంత వర్షంలో ఇలా వచ్చేవేమిటి?" అంటూ అడిగేను.

"రాజూ! అర్జెంటుగా యాభయి రూపాయలు కావాలి. నువ్వు సర్ద

గలవనే ఆశతో వచ్చాను. ఈ సహాయం చేస్తే ఈ జన్మలో నీ మేలు మరచిపోలేను" ఉద్వేగంతో అన్నాడు.

నాకు కొంత ఆశ్చర్యం కలిగినమాట వాస్తవం!

"ఇంత రాత్రి సమయంలో యాభయిరూపాయల అవసరం వీడికేం వచ్చింది?" అనుకున్నాను.

నా వద్ద డబ్బు వుంది.

మరునటి దినం టెర్లిన్ చొక్కా కుట్టించాలనుకున్నాను.

ఇపుడు యాభయి రూపాయలు వాడికి ఇచ్చేస్తే, అది ఇంతలో తిరిగి రాదు.

నా టెర్లిన్ చొక్కా కుట్టించుకోవాలనే ఆశ ఇంతలో తీరదు. మనసు జగన్నాధానికి సహాయం చేయటానికి ఒప్పుకోలేదు!

"ఒక్కసారిగా యాభయి రూపాయలు కావాలంటే ఎక్కడనుండి వస్తాయి ? నేమా నీలాగ గుమాస్తానే కదా !" అని నిలువునా అబద్ధం ఆడేసి, ఒకనవ్వు ముఖానికి పులుముకున్నాను.

జగన్నాధం ముఖంలో నిరాశ స్పష్టంగా తొంగిచూసింది.

"నీ దగ్గర వుంటుందనే ఆశతో వచ్చాను. ఏం చేస్తాం ? మరొక చోట ప్రయత్నిస్తానులే !" అంటూ తలుపులూ తెరచుకుని, తొందరగా అడుగులు వేసుకుంటూ వర్షంలోనికి నడిచి వెళ్ళిపోయాడు,

ఆ రాత్రంతా వర్షం కురుస్తూనే వుంది !

వర్షం కురిసినరాత్రి తెల్లారింది.

వానవేగం తగ్గినా, చినుకులు మాత్రం పడుతూనే వున్నాయి.

ఉదయం తొమ్మిది గంటలకు హోటల్లో భోజనం ముగించి, ఆఫీసు వైపుకు నడక సాగించేను.

రోడ్డు బురదగా వుంది -

మళ్ళీ పెద్దదవబోయే వర్షాన్ని సూచిస్తూ, నింగిలో మబ్బులు ముసురుకుంటున్నాయి.

ఆఫీసు దారిలోనే జగన్నాధం ఇల్లు !

అరుగుమీద, స్తంభానికి ఆనుకుని కూర్చుని, పిచ్చిగా శూన్యంలోనికి చూస్తున్నాడు వాడు !

నెలరోజులనుండి తిండి లేనివాడిలా అతి నీరసంగా వున్నాడు.

వరండాలోనికి మెల్లిగా అడుగుపెడుతూ అడిగేను.

"ఏం జగన్నాధం ? అలా కూర్చున్నావేం ?"

నన్ను చూడగానే వాడి కన్నుల్లో నీరు చిప్పిల్లింది !!

"కూర్చోక ఏం చేయగలను ? నేను అసమర్థుణ్ణి ! దరిద్రుణ్ణి ఎందుకూ పనికిరాని వాడిని ! నాలాంటి వాళ్ళను భగవంతుడు ఎందుకు పుట్టిస్తాడో తెలీదు. లోకంలోని నిర్భాగ్యపు గుమాస్తాలందరూ కలిసి దేవుడిమీద తిరగబడగలిగితే ఎంత బాగుంటుంది ?...."

కొంతసేపు మాటలు ఆపేడు !

నేను చేష్టలుడిగి అతడి వంకే చూస్తూవుండిపోయాను.

గొంతు సవరించుకుని మళ్ళీ అన్నాడు.

"....మూడు రోజులనుండి నా భార్యకు జ్వరం ! నిన్నరాత్రి పరిస్థితి విషమించింది ! డాక్టరు తాను చేయగలిగింది ఏదీ లేద

న్నాడు! ఈ వూళ్లో వైద్యసౌకర్యాలు తక్కువగనుక విశాఖపట్నంలోని పెద్దాసుపత్రికి వెంటనే తీసుకు పొమ్మన్నాడు! పెద్దాసుపత్రిలో చేరిస్తే ఫలితం వుండే అవకాశం వుందన్నాడు! కానీ....కానీ, ఆమెను విశాఖ పట్నం ఎలా తీసుకువెళ్ళగలను? నా చేతిలో పదిరూపాయలు కంటె ఎక్కువ లేవు. ఎవరి దగ్గరా నయాపైసా అప్పుపుట్టలేదు! ఇంకా అప్పు చేయవలసిన అవసరం లేదులే! నా భార్యను విశాఖపట్నం పెద్దాసుపత్రికి తీసుకుని వెళ్ళవలసిన అవసరం కూడాలేదు! పిడికెడు బుగ్గిచేస్తే చాలు! నా భార్య—

నా దారిద్ర్యానికీ అసమర్ధతకూ బలి అయిపోయిన నా భార్య—

లోపల మంచంమీద అతి ప్రశాంతంగా నిద్రపోతోంది చూడు!....

మాటలు ఆపి, బిగ్గరగా, విచిత్రంగా నవ్వుతున్నాడు జగన్నాథం!

అలా నవ్వుతూవుంటే, వాడిలోనుండి ఏదో భయంకరమైన భూతం బయటకు వచ్చి, నా జుట్టు పట్టుకుని పీకుతున్నట్లనిపించింది!

నా గుండెల్లో దడ, కాళ్ళలో వణుకు ఆరంభమయ్యేయి!

'నిన్న రాత్రి నేను జగన్నాథానికి ఇచ్చివుంటే, పరిస్థితి ఎలా వుండేది?....'

మరి ఆలోచించలేక పోయాను,

జేబులోని నోట్లు గొంగళీ పురుగుల్లా మారి, శరీరంమీద పాకుతున్నట్లు అనిపించింది.

"ఈ డబ్బు వుంచు. తరువాత పనులకు పనికివస్తుంది."

అంటూ జేబులోని పురుగుల్లాంటి నోట్లను తీసి, వాడిమీదకు విదిల్చేను.

బయట వర్షంతో బాటు—

నాలోని బాధాగ్ని హెచ్చవుతోంది !

నాలోని కుటిలత్వాన్నీ, స్వార్థాన్నీ ఈ వర్షపునీరు కడగలేదు !

వర్షపు హోరు ఎవరో ఏడుస్తున్నట్లుంది !!!